క్లుప్తంగా

వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్‌కు మోడ్రన్ కేఫ్ అధినేత మురళీధర్‌రావు రూ.లక్షా 116 విరాళంను ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్‌సోలంకీలకు దుర్గాపురంలో మంగళవారం అందజేశారు. ట్రస్ట్ ద్వారా వయోవృద్ధులకు అందిస్తున్న సేవల్లో తాను కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో విరాళం అందజేసినట్లు మురళీధర్‌రావు తెలిపారు. ట్రస్ట్ ఛైర్మన్ హరికుమార్ మాట్లాడుతూ తాము దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను విస్తృతం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు తట్టి అర్జునరావు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో 24 గంటలూ వైద్య శిబిరాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): దసరా మహోత్సవాల్లో 24 గంటలూ వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా డీఎం హెచ్ఓ మాచర్ల సుహాసిని తెలిపారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను మంగళవారం డాక్టర సుహాసిని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ ఉత్సవాల్లో 12 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రోజూ మూడు షిఫ్టుల్లో ఈ నెల 25 వరకూ నిర్వహించే శిబిరాల్లో 330 మంది వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట పలువురు వైద్యాధికారులు ఉన్నారు.

లక్ష తమలపాకులతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయి బాబా మందిరంలో సాయినాథుని 105వ పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష తమలపాకులతో అర్చన జరిగింది. క్షీరం, ఆవునెయ్యితో అభిషేకం చేశారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి దంపతులు సాయినాథ, సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

ప్రజాపాలకుడు శ్రీకృష్ణదేవరాయలు

విజయవాడ కల్చరల్: ప్రజాపాలకుడు శ్రీకృష్ణదేవరాయలు అని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని బీఆర్‌టీఎస్ రోడ్డులోని విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని పూలమాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు కవి పండితులకు భూ విరాళాలను ఇచ్చి అగ్రహారాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వర్, శెట్టి రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం రామలింగేశ్వరపేట ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళలు కోలాటం చేస్తూ భక్తి గీతాలను ఆలపించారు.

సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీ దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో మంగళవారం శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చిన్నారులు భక్తి కీర్తనలకు అనుగుణంగా చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని విశ్రాంత పోలీసు అధికారి డేవిడ్‌రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, సువర్ణమణి రిథమ్స్, మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల సందర్భంగా జిల్లాస్థాయి గాయనీ గాయకుల ఆత్మీయ సమావేశం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. నవమి నాటి వెన్నెల నీవు పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని పేర్కొన్నారు. జెప్సీ, పావని, రేష్మ, సిద్దిక్ సినీ గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను సత్కరించారు.

అన్నపూర్ణదేవిగా అమ్మవారు


అన్నపూర్ణదేవి... నమోస్తుతే



శ్రీగాయత్రిదేవిగా అంకమ్మతల్లి అమ్మవారు



శివకామేశ్వరి పీఠంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు



శిరామకృష్ణ క్షేత్రంలో వృషభవాహన బ్రాహీదేవి



రామలింగేశ్వరపేటలో అమ్మవారు



జీవీఆర్‌నగర్‌లో అన్నపూర్ణదేవి అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారం మూడోరోజుకు చేరాయి. అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

శివకామేశ్వరీపీఠం: అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. అమ్మవారికి శ్రీచక్రార్చన, చండీ హోమం, లక్ష్మీ గణపతి, నవగ్రహ శ్రీరుద్ర శత చండీయాగం నిర్వహించారు.

రామలింగేశ్వరపేట: రామలింగేశ్వరపేట ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకారంలో పూజలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు.

అయోధ్యనగర్: అయోధ్యనగర్ గంగానమ్మ అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకారం చేసి చండీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు పూజలో పాల్గొన్నారు.

ముత్యాలంపాడు: ముత్యాలంపాడు పార్వతి సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకారం చేసి కుంకుమార్చనలు చేశారు.

జీవీఆర్‌నగర్: గద్దె వెంకట్రామయ్యనగర్‌లో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో పూజలు అందుకున్నారు. మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని గాయత్రీదేవి అలంకారంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

బావాజీపేట: బావాజీపేట నాలుగోలైనులో శ్రీ దేవి ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు మాధవీకృష్ణ పూజలు నిర్వహించారు.



అయోధ్యనగర్ గంగానమ్మ దేవాలయంలో చండీహోమం



న్యూఆర్ఆర్‌పేటలో ....

మధురానగర్: మధురానగర్ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో పూజలు అందుకున్నారు.

విజయవాడ కల్చరల్: విశ్వమాతా చారిటబుల్ సంస్థ ఆధ్వర్యాన హనుమాన్‌పేటలోని శంకర మఠంలో అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించారు. నిడుమోలు రమాసత్యనారాయణ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీ దేవికి త్రికాల పూజ, చండీహోమం, రుద్ర హోమం, విజయదుర్గా హోమం చేశారు.

శివరామ కృష్ణ క్షేత్రంలో: శృంగేరీ శారదాపీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంలో మంగళవారం బాలా త్రిపుర సుందరిని అన్నపూర్ణాదేవిగానూ, శారదాంబను వృషభవాహన మాహేశ్వరిగానూ, మహాలక్ష్మిదేవిని ధాన్యలక్ష్మిగానూ అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. దేవాలయంలో జరిగిన కుంకుమార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ నిర్వహించారు.

న్యూరాజరాజేశ్వరీపేట

స్థానిక 57డివిజన్ న్యూరాజరాజేశ్వరిపేటలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో మంగళవారం అన్నపూర్ణదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గా సప్తశతీ చండీ హవనం(హోమం), లలితా సహస్రనామార్చనతో కుంకుమపూజలు, పంచహారతులు, ప్రసాద వితరణలు నిర్వహించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 32వ డివిజన్ 231వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణితో కలిసి ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మోడల్ ప్రాంతంగా లోటస్ ల్యాండ్‌మార్క్

చంద్రబాబు హయాంలో చెరువులను తలపించిన లోటస్ ల్యాండ్‌మార్క్ ప్రాంతాన్ని మన ప్రభుత్వంలో మోడల్ ప్రాంతంగా తీర్చిదిద్దామన్నారు. సెక్టార్-5లోనూ అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.40లక్షలతో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మల్లాది పేర్కొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళుతోందని ఎమ్మెల్యే అన్నారు. విశాఖలో ఇన్ఫోసిస్ సహా ఫార్మా కంపెనీలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గుండె సుందర్‌పాల్, ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణిరెడ్డి, గుడిసె శ్యామ్, చింతా పెద్దిరాజు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం



రోగులకు జగనన్న సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు, కమిషనర్ స్వప్నిల్ దినకర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికీ నాణ్యమైన వైద్యం అందించి ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ 59వ డివిజన్ 244వ వార్డు సచివాలయం పరిధిలో బూదాల ఆదాము కళ్యాణ మండపంలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి వద్దకే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా సురక్ష క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఈసీజీ, థైరాయిడ్, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నామని తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోడు, టీబీ వ్యాధి గ్రస్తులకు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, రమేష్‌రెడ్డి, కొండా జయలక్ష్మీ, శాంతకుమారి, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదవాడికి నిజమైన రక్ష

- కార్పొరేట్ తరహాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- ప్రభుత్వంపై సర్వత్రా హర్షం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ లూనాసెంటర్ ప్రాంతానికి చెందిన చింతపల్లి శ్రావణి(8) అనే చిన్నారి రోజూ స్కూల్‌కు వెళ్లి వస్తూ బాగానే ఆడుకుంటుంది. అయితే ఆమె కంటిచూపు విషయంలో అప్పుడప్పుడు కాస్త సమస్య ఎదురవుతుంది. ఇంట్లో చెప్పినా వారు ఆ సమస్యను పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా చిన్నారికి పరీక్షలు చేయగా కంటి సమస్యతో పాటు దంత సమస్యలు కూడా బయటపడ్డాయి. ఇప్పుడు ఆమెకు కంటి, దంత వైద్య నిపుణులతో ఉచితంగా చికిత్సను అందిస్తోంది.

- అలాగే సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ ముంతాజ్ బేగం(54)అనే గృహిణికి ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేయగా ఆమె బీపీ, కీళ్ల నొప్పుల సమస్యలతో బాధపడుతున్నట్లుగా తెలిసింది. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో ఇప్పుడు ఆమెకు వైద్య నిపుణులు మరిన్ని పరీక్షలు చేయించి చికిత్స అందిస్తున్నారు.
- కాశీపోగు స్వామిప్రసాద్(57) అనే వ్యక్తి రాడ్‌బెండింగ్ పనులు చేస్తూ ఉంటారు. అయితే ఆయన కంటి చూపు సమస్యతో బాధపడుతున్నట్లుగా ఆరోగ్య సిబ్బంది గుర్తించి స్వామిప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆరోగ్య రక్షణకు శ్రీకారం చుడుతోంది. ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా తలపెట్టిన ఈ కార్యక్రమం లక్షలాది మంది బతుకుల్లో నూతన వెలుగులను నింపుతోంది.

కార్పొరేట్ హాస్పిటల్స్‌ను తలదన్నేలా సేవలు: వాడవాడల్లో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలు కార్పొరేట్ హాస్పిటల్స్‌ను తలదన్నేలా ఉంటున్నాయి. ఉచితంగా అన్ని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కావాల్సిన మందులను కూడా అందిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య సురక్ష గొప్ప ఆలోచన



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య సేవలను ఇంటివద్దకే వచ్చి అందించడం చాలా గొప్ప విషయం. దీని ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఏ ఆధారం లేనివారి ఆరోగ్యానికి మరింత భరోసానిస్తుంది.

– షేక్.ముంతాజ్ బేగం(సింగ్‌నగర్).

పేదలకు మరింత మేలు:



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు ఇస్తుండడంతో అందరికి ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుంది. ఇటువంటి క్యాంపుల ద్వారా పేదలకు మరింత మేలు జరుగుతున్నది. – కె.స్వామిప్రసాద్(సింగ్‌నగర్).

మధురంగా దేవి గాన సుధ



దేవి కీర్తనలను ఆలపిస్తున్న అంజనాసుధాకర్ బృందం

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సేవా సంస్థ దసరా సంగీత మహోత్సవాలలో భాగంగా రెండురోజుల పాటు నిర్వహించే దేవి గాన సుధ కార్యక్రమం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికలో మంగళవారం ప్రారంభమయ్యాయి. సంగీత విద్వాంసురాలు అంజనాసుధాకర్ బృంద సభ్యులు లంక తేజస్వి, సాత్విక, కాజ భువన, శృతిలు దేవి కీర్తనలను మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్, సంగీత విద్వాంసుడు వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): పురుగుల మందు తాగి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ తేజావత్తు బాలాజి(46)అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు, వాంబేకాలనీ జి బ్లాకులో ఉంటున్న బాలాజి లారీలకు గ్రీజు పెట్టే పని చేస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ నెల 14న ఇంటిపైకి వెళ్ళి పురుగుల మందు తాగుతుండగా పక్కింటివారు చూసి కేకలు వేయడంతో భార్య దీపిక, కొడుకు మనోహర్ చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 16న రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు.

మూలా నక్షత్రం రోజున సహకరించాలి

కనకదుర్గనగర్‌లో దుకాణదారులతో సీపీ రాణా



కనకదుర్గనగర్‌లో దుకాణదారులతో మాట్లాడుతున్న సీపీ రాణా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రం రోజున భక్తులకు ఇబ్బంది కలగకుండా దుకాణాలు మూసివేసి పోలీసులతో సహకరించాలని సీపీ టీకే రాణా సూచించారు. కనకదుర్గనగర్‌లోని పూజా సామగ్రి, ఫ్యాన్సీ దుకాణ యజమానులతో సీపీ టీకే రాణా మంగళవారం మాట్లాడారు. తొలుత అమ్మవారి ఆలయానికి చేరుకున్న సీపీ క్యూలైన్లో భక్తులతో మాట్లాడారు. అమ్మవారి దర్శనంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీసీ కెమెరా కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. మహా మండపం, ఆలయ పరిసరాల మీదగా కొండ దిగువకు చేరుకున్నారు. ప్రతి సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవానీఘాట్, పున్నమి ఘాట్‌లకు చేరుకున్న సీపీ వీఐపీ వాహనాల్లో కొండపైకి చేరుకునే భక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట డీసీపీ విశాల్ గున్ని, ఏఐజీ ఎం. రవీంద్రబాబు, డీసీపీ అజిత వేజెండ్ల, ఈవో కె.ఎస్.రామారావు, క్రైం ఏడీసీపీ వెంకటరత్నం, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా 'సురక్ష' అమలు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం ఉన్నతాధికారులతో, సచివాలయం సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్క కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనేది ప్రధాన లక్ష్యంగా 229 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలోని స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, వలంటీర్ల, ఆశావర్కర్ల సారథ్యంలో ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను తెలుసుకోవాలని, ప్రీ సర్వే లో ఆరోగ్య శ్రీ యాప్‌ను వివరించాలని, వైద్య సేవలు అవసరమైన వారికి టోకెన్లు అందించారని తెలిపారు. సమావేశంలో వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


నృత్యవైభవాన్ని చాటుతున్న ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గానగర్‌లో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ నృత్యవైభవాన్ని చాటుతున్నాయి. మంగళవారం ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు, ఆంధ్రనాట్యం అంశాలను ప్రదర్శించారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల నృత్యవిభాగం అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్ బృందం అందెలరవమిది పదములుదా, ఇదిగో భద్రాద్రి అంశాలను ప్రదర్శించారు. మైలవరానికి చెందిన నాట్యకళాకారిణి ఎస్.కనకలక్ష్మి బృందం, అనూషా నాయుడు, నందికొట్కూర్‌కు చెందిన జగదీష్ , విశాఖపట్నానికి చెందిన సుజన దీపిక, హైదరాబాద్‌కు చెందిన జానకి బృందాలు సంప్రదాయ నృత్యాలను అభినయించారు. సంగీత విద్వాంసుడు ప్రద్యుమ్నకుమార్ వయోలిన్‌పై సంప్రదాయ కీర్తనలను హైదరాబాద్‌కు చెందిన అనంతలక్ష్మి బృందం వీణపై వాగ్గేయకార కీర్తనలు పలికించారు. నిర్వాహకులు నృత్యకళాకారులకు ప్రశంసా పత్రాలను, అమ్మవారి లడ్డూప్రసాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సీతారామా కల్యాణ మండపంలో మంగళవారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలివేలు మంగతాయారు బృందం కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య కీర్తనలకు నృత్యాలను అభినయించారు. నాట్యాచారిణి మొక్కపాటి అవంతి బృందం సంప్రదాయ కీర్తనలకు నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమ నిర్వాహక సభ్యులు కందుకూరి సుబ్రహ్మమణ్య శర్మ చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఐటీఐ విద్యార్థుల్లో స్కిల్స్ పెంపునకు 'వాద్వాని'తో ఒప్పందం



అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న ఉపాధి శిక్షణశాఖ డైరెక్టర్ నవ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని ఐటీఐ విద్యార్థుల్లో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ పెంచేలా తీర్చిదిద్దడానికి బెంగుళూరుకు చెందిన వాద్వాని ఫౌండేషన్‌తో రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ అధికారులు మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యార్థుల్లో ఐటీ, ఆంగ్ల భాషా నైపుణ్యం, సాఫ్ట్‌స్కిల్స్ మెరుగుపర్చడానికి వాద్వానితో కలిసి శిక్షణ ఇవ్వనున్నారు. తొలిదశలో 40 ప్రభుత్వ ఐటీఐల్లోని విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఐటీఐ రెండో సంవత్సరం విద్యార్థులకు 65 గంటలు , మొదటి సంవత్సరం విద్యార్థులకు 70 గంటలు శిక్షణ ఇవ్వనున్నట్లు ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ బి.నవ్య తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు సునీల్ దాహియ, ఉపాధి శిక్షణశాఖ జాయింట్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం , ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దసరా సందడి

దసరా.. నగరానికి సందడిని తెచ్చింది. ఉత్సవాల్లో మూడో రోజు మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్గమ్మను దర్శించుకున్న భక్తజనం మది పులకించింది. దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థాన ప్రాంగణం వివిధ వర్ణాల విద్యుత్ తోరణాలతో కళకళలాడుతోంది. ఆలయంలో జరిగిన ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. ఉత్సవాల సందర్భంగా జరిగిన నగరోత్సవంలో డప్పు కళాకారుల విన్యాసాలు, కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు భారతీయ నృత్య వైభవాన్ని చాటుతున్నారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చిన విభిన్నప్రతిభావంతులు, పెద్దవారికి వలంటీర్లు తమవంతు సేవ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









